ప్రజాశక్తి


సోమవారం 30 డిసెంబర్ 2024   8 పేజీలు



గుంటూరు



పల్నాడు



తాడేపల్లిలో ప్రచారం

దేశ సమైక్యత, మత సామరస్యం కోసం సిపిఎం విస్తృత ప్రచారం

5లో



సమావేశంలో ఐక్యతా అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

కేసులు తగ్గినా తగ్గని నేరప్రవృత్తి

మహిళలపై ఆగని లైంగిక దాడులు - పెరిగిన రోడ్డు ప్రమాదాల మరణాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో గతేడాది కాలంలో నేరాలసంఖ్య తగ్గినట్టు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నా జరుగుతున్న నేరాలను పరిశీలిస్తే నేరప్రవృత్తి పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. ప్రధానంగా సునాయసనంగా డబ్బు సంపాదించాలన్న లక్ష్యంతో ఎక్కువ మంది సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. నిత్యం వేలాది మంది జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు కేంద్రం 1930కి ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. కొన్ని సమయాల్లో సైబర్ నేరాల్లో ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా నష్టపోయి అనేమంది మిన్నకుండిపోతున్నారు. సైబర్ నేరాలు గతేడాది 286 నమోదు అయ్యాయి. ప్రజలు తమ సొత్తు రూ.10.05 కోట్లు నష్టపోగా కేవలం రూ.3.20 కోట్ల వరకు రికవరి చేశారు. ఈ ఏడాది 221 కేసుల్లో రూ.27.18 కోట్లు నష్టపోయారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.10.69 కోట్లు రికవరి చేయగలిగారు.

ఈ ఏడాది సాధారణ నేరాలు, మహిళలపై దాడులు స్వల్పంగా తగ్గినా రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. మహిళలపై గతేడాది 99 అత్యాచారాలు జరగ్గా, ఈ ఏడాది ఇప్పటి వరకు 77 కేసులు నమోదయ్యాయి. మైనర్ బాలికలపై అఘాయిత్యాలు గతేడాది 154 జరగ్గా ఈ ఏడాది 146 నమోదయ్యాయి. మొత్తంగా మహిళలపై దాడులు గత ఏడాది

2లో



చేబ్రోలులో హత్యకు గురైన బాలిక శైలజ

12 మందిపై పీడీ యాక్టు

2వ పేజీ

ప్రజల గొంతుక కెఎస్ లక్ష్మణరావు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు అందరి బాధ్యత
- ఆత్మీయ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక, పెన్షనర్లు, ఇతర వివిధ వర్గాల ప్రజల సమస్యలను నిత్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ పరిష్కారానికి కృషి చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వివిధ ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మార్చిలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ స్థానిక ఎన్‌జిఒ కళ్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వివిధ వర్గాల ప్రజలు సమావేశంలో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలిలో ప్రజాగొంతుక వినబడాలంటే కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లక్ష్మణరావుకు సొంత ప్రయోజనాలు ఏమీ లేవని, ప్రజాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఆయన ప్రధాన అజెండా అని చెప్పారు. టీచర్, గ్రాడ్యుయేట్ల ప్రాతినిధ్యం కోసం కేటాయించిన ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో రాజకీయ నేతలు పోటీ చేయటం తగదన్నారు. ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఇటీవల తూర్పు, పశ్చిమ గోదావరి ఎన్నికల్లో గెలుపొందిన పిడిఎఫ్ అభ్యర్థి స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే నూతన ప్రభుత్వం కూడా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక, పెన్షనర్ల సమస్యలు ఒక్కటీ పరిష్కారం చేయలేదని, ఆరు నెలల పాలనలో వారి ఊసే లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటానికి లక్ష్మణరావును గెలుపించుకోవాలన్నారు.

కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2007లో శాసన మండలి పునరుద్ధరించిన నాటి నుండి పిడిఎఫ్ అభ్యర్థులు 14 మంది గెలుపొంది, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని చెప్పారు.

2లో

రేపు సిఎం పర్యటన ఇలా...

2లో



గుంటూరులో ప్రదర్శన

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయండి





నరసరావుపేటలో బైక్ ర్యాలీ, ప్రారంభిస్తున్న లక్ష్మణరావు

వార్తలు 5, 6 పేజీల్లో

బహుమతులు గెలుచుకుని.. అనుభవాలు పోగేసుకుని..

- ముగిసిన పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ-2
- విద్యార్థులు పెడధోరణల బాటపట్టకుండా నిరంతర కృషి
- బాలోత్సవాల వ్యవస్థాపకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్
- విద్యార్థుల్లో నైపుణ్యాలకు మెరుగుపట్టేలా పండుగ
- బాలోత్సవం కమిటీ నిర్వాహకులు ఉద్ఘాటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాటికలు, జానపద, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి పాటలు, కోలాటం, స్పెల్ బి, ప్రాజెక్టు పని, రంగవల్లులు, విచిత్ర వేషధారణలు, మెమొరీ టెస్ట్, బెస్ట్ ఫ్రం వేస్ట్, వక్తృత్వం, కథలు చెప్పడం,

2లో





ముగింపు సభలో మాట్లాడుతున్న బాలోత్సవాల వ్యవస్థాపకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్, ఉత్సవాల్లో భాగంగా నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

కేసులు తగ్గినా తగ్గని నేరప్రవృత్తి

(మొదటి పేజీ తరువాయి)

1368 నమోదు కాగా ఈ ఏడాది 1035 జరిగాయి. దోపిడీలు, దొంగనాలు కూడా గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కొనసాగాయి. గతేడాది రూ.11.16 కోట్ల సొత్తు దోపిడీ జరగ్గా రూ.10.53 కోట్ల వరకు సొత్తు చోరీకి గురైంది. అయితే రికవరి గతేడాది రూ.6.48 కోట్లు జరగ్గా ఈఏడాది రూ.4.01 కోట్లు జరిగింది. గతేడాది కాలంలో తెనాలిలో కొంత మంది మహిళలు ముగ్గురిని సైనేడ్ కలిపి చంపిన ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో మైనర్ బాలిక పి.శైలజ హత్య జిల్లాలో కలకలం రేపింది. నాగరాజు అనే యువకుడు ఈ బాలికను హత్య చేయగా నిందితుడ్ని చాలా రోజుల తరువాత అరెస్టు చేశారు. గుంటూరు కొత్తపేటలో పోలీసునని చెప్పి ఒకవిద్యార్థిపై అత్యాచారం, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు అపహరణ ఘటన కూడా సంచలనంగా మారింది.



12 మందిపై పీడీ యాక్టు - త్వరలో జిల్లా బహిష్కరణ : గుంటూరు ఎస్పీ

గంజాయి, ఎన్‌డిపి లిక్కర్ ఇతర నేరాలకు తరచూ పాల్పడుతున్న 12 మందిపై పిడి యాక్డు అమలుకు నిర్ణయించినట్టు జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకరిని నగర బహిష్కరణకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు చేశామన్నారు. ఆస్తి నేరాలు గతేడాది 1290 నమోదు కాగా ఈ ఏడాది 1039 కేసులు నమోదయ్యాయని తెలిపారు. రౌడీయిజాన్ని సహించబోమని తెలిపారు. బహిరంగ మద్యపానం, బైండోవర్‌లు మరియు మొదలైన వాటిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. రౌడీషీటర్లకు ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ చేసి అరెస్టులు చేస్తున్నామన్నారు. ప్రస్తుత సంవత్సరంలో మహిళలపై నేరాలకు సంబంధించి 1035 కేసులు నమోదవగా అంతకుముందు సంవత్సరంలో 1368 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వారధి, మహిళా అవగాహన కార్యక్రమాల నిర్వహణ కారణంగా నేరాలు 24 శాతం తగ్గినట్లు చెప్పారు.

రేపు సిఎం పర్యటన ఇలా...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం యలమంద గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీ నిమిత్తం సిఎం చంద్రబాబు మంగళవారం రానున్నారు. ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలో హెలికాప్టర్‌లో బయల్దేరి 11 గంటలకు యల్లమంద గ్రామానికి చేరుకుంటారు. 11.05 గంటలకు హెలిప్యాడ్ వద్ద సిఎంకు నాయకులు, అధికారులు స్వాగతం పలుకుతారు. 11.10 గంటల నుంచి 11.40 వరకు పింఛన్లను సిఎం పంపిణీ చేస్తారు. 11.40 గంటల నుంచి 11.45 మధ్య యల్లమంద గ్రామంలోని కోదండరామస్వామి దేవాలయాన్ని సందర్శిస్తారు. 11.45 గంటల నుంచి 12.45 వరకు లబ్ధిదార్లు, గ్రామస్తులతో సిఎం మాట్లాడతారు. 12.45 నుంచి 12.50 మధ్య హెలిప్యాడ్ ప్రాంతంలో భోజనం చేస్తారు. 12.50 నుంచి 1.05 వరకు జిల్లా అధికారులతో సమావేశమై 1.35 నుంచి 1.50 మధ్యలో కోటప్పకొండ చేరుకుంటారు. 1.50 గంటల నుంచి 2.20 వరకు త్రికోటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటారు. 2.35 గంటలకు కోటప్పకొండ నుంచి యల్లమందలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 2.40 గంటలకు యల్లమందలో బయలుదేరి 3.10 గంటలకు ఉండవల్లి చేరుకుంటారని అధికారవర్గాలు తెలిపాయి.

సిఎం పర్యటన ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. యలమంద గ్రామంలో సిఎం పర్యటించే ప్రాంతాలు, కలిసే లబ్ధిదార్ల ఇళ్లు, హెలిప్యాడ్, వాహనాలు పార్కింగ్ ప్రాంగణాలను, సిఎం సందర్శించనున్న కోటప్పకొండ ప్రాంతాన్ని పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని డ్రోన్‌ల ద్వారా బందోబస్తునూ పర్యవేక్షిస్తామని ఎస్పీ చెప్పారు. కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఇదిలా ఉండగా ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ కింద నుండి కొండపైకి వెళ్లేందుకు రోప్ వే ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కోటప్పకొండ అభివృద్ధికి మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ చేసిన కృషిని కొనసాగిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పారు. పరిశీలనలో అడ్మిన్ ఎస్పీ జెవి.సంతోష్, ఎఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్‌బి సిఐలు సురేష్‌బాబు, శరత్‌బాబు పాల్గొన్నారు.



పెన్షన్ పంపిణీకి ముఖ్యమంత్రి వెళ్లనున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

ప్రజల గొంతుక కెఎస్ లక్ష్మణరావు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలతో సంబంధం లేకుండా నీతి, నిజాయితీతో, అసెంబ్లీలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పోషిస్తున్నామని చెప్పారు. ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ప్రజాబలమే పిడిఎఫ్ బలమని ఉద్ఘాటించారు. వివిధ వర్గాల సమస్యలతోపాటు, గుంటూరు జిల్లాలోని గుంటూరు చానల్, వరికెపూడిసెల, ఇతర స్థానిక సమస్యలపైనా నిత్యం మాట్లాడుతోంది పిడిఎఫ్ మాత్రమేనని చెప్పారు. 30న తుది ఓటర్ల జాబితా విడుదలైన నాటి నుండి ప్రతి ఒక్క ఓటరునీ ప్రత్యక్షంగా కలిసి, ప్రభుత్వ విధానాలు, పిడిఎఫ్ ప్రత్యామ్నాయ విధానాలను వివరించాలని కోరారు. సిఐటియు జాతీయ నాయకులు ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు భిన్నంగా ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ నిజమైన ప్రజాప్రతినిధిగా కెఎస్ లక్ష్మణరావు గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు చేసుకుంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావించారని గుర్తు చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు బాధ్యత గ్రాడ్యుయేట్ల అందరిదీ అని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

సభలో ఆలిండియా లాయర్స్ అసోసియేషన్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు వివికె.సురేష్, ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ఉద్యోగుల సంఘం నాయకులు భాను, జూనియర్, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపక సంఘాల నాయకులు కె.రత్నకుమారి, సాయిరాజు, ఆర్.స్వాతి, ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఎ.నాగయ్య, రిటైర్డ్ జూనియర్ అధ్యాపకుల సంఘం యం.కైలాష్‌నాథ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నాయకులు కె.సత్యనారాయణరెడ్డి, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు గాంధీరామ్మోహన్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమకుమారి, ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు సాంబశివరావు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కె.గంగాధర్, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు సలీం, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.అనురాధ, ఎస్‌పిఎల్‌టిఒ నాయకులు గోవిందరాజు, గురుకుల ఉపాధ్యాయుల సంఘం నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ ఎం.కిరణ్, డివైఎఫ్ఐ వై.కృష్ణకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం ఇ.అప్పారావు, రైతుసంఘం కె.అజయ్‌కుమార్, కౌలురైతు సంఘం బి.శ్రీనివాసరావు, అవాజ్ ఎం.ఎ.చిష్టీ, ఐద్వా ఎల్.అరుణ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజి, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు బి.ముత్యాలరావు, ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు టివిజి రవిశంకర్, పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొని లక్ష్మణరావుకు మద్దతు తెలిపారు.

అనుభవాలు పోగేసుకుని..



(మొదటి పేజీ తరువాయి)



ముగింపు సభలో మాట్లాడుతున్న పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు

బుర్రకథ, తెలుగు పద్యాలు, అభినయ గీతాలు, రైమ్స్, మట్టి బొమ్మలు, కోలాటం, వ్యాస రచన తదితర 65 అంశాల్లో వేలాది మంది విద్యార్థులు సందడిగా చేసిన ప్రదర్శన ముచ్చటగొల్పింది. నరసరావుపేటలోని పాలడుగు నాగయ్య చౌదరి కొత్త రఘురామయ్య కళాశాలలో శని, ఆదివారాల్లో రెండ్రోజులపాటు నిర్వహించిన పల్నాడు బాలోత్సవం పిల్లల పండగ-2 ఉత్సాహపూర్తి వాతావరణంలో ఆదివారం ముగిసింది. పలు అంశాల్లో విజేతలుగా నిలిచిన పిల్లలు బహుమతులు పొందగా అందరూ కొత్త అనుభవాలు, కొత్త పరిచయాలు పోగేసుకుని సరికొత్త స్ఫూర్తిని పొందారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా బాలోత్సవాల వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా బాలోత్సవాల అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు, విద్యావేత్తలు మూఢ నమ్మకాలతో కాకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సూచించారు. నేటి యువత పాఠశాల విద్య దశలోనే వ్యసనాలకు బానిసలవుతున్నారని, విలువైన జీవితాన్ని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ పెడధోరణుల నుండి వారిని కాపాడే కృషిలో బాలోత్సవాలు ఉన్నాయని చెప్పారు. 25 ఏళ్లకు పైగా నిర్వహిస్తున్న బాలోత్సవాల ద్వారా అప్పటి బాలలు నేడు తమ పిల్లలను వీటికి తేవడంతోపాటు తమ మనవడు, మనవరాళ్లను కూడా తీసుకువస్తామని చెబుతున్నారని తెలిపారు. బాలోత్సవాల ద్వారా క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని అలవాటు చేసుకున్నామని వారు చెబుతున్నారని అన్నారు. బాలోత్సవాలను నిరంతరం కొనసాగిస్తూ విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి సంస్కృతి, సంప్రదాయాలపట్ల అవగాహన, అభ్యుదయ భావాల వ్యాప్తికి కృషి చేస్తూనే ఉంటామని ఉద్ఘాటించారు. కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు చాలా తెలివైన వారని, నూటికి నూరు మార్కులు సాధించే విద్యార్థులు ఉపాధ్యాయుల కంటే ఎంతో తెలివైన వారని అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ తప్పనిసరిగా ఏదో ఒక నైపుణ్యత దాగి ఉంటుందని, వాటికి మెరుగుపట్టి ప్రదర్శించేందుకు బాలోత్సవం ఒక మంచి వేదికని చెప్పారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం పల్నాడు బాలోత్సవాల అధ్యక్షులు చిలకల రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పల్నాడు బాలోత్సవాల గౌరవ అధ్యక్షులు ఎమ్మెస్ఆర్.కె ప్రసాద్, కోశాధికారి కోయా రామారావు, కమిటీ సభ్యులు ఎ.భాగేశ్వరిదేవి, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, గౌస్ మొహిద్దీన్, సాంబశివరావు, బాలాజీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, పల్నాడు విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కె.రామారావు, షేక్ మస్తాన్‌వలి, ఎస్.ఆంజనేయులు నాయక్, డి.శివకుమారి, ఆంజనేయరాజు పాల్గొన్నారు.



హక్కులపై సంఘటితంగా పోరాటం

గిరిజనుల విద్యకు ప్రాధాన్యమివ్వాలి : ఉద్యోగుల సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉద్యోగులు ఐకమత్యంగా హక్కుల సాధనకు కృషి చేయాలని రిటైర్డు అదనపు ఎస్‌పి మొగిలి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం జరిగిన గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్‌తో పాటు జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కమిటీ అధ్యక్షులు మేడా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. గిరిజన ఉద్యోగులు తమకు రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ ప్రకారం ఉద్యోగ నియమకాలు ప్రమోషన్స్ విషయంలో తగినంత అవగాహనను కలిగి ఉండాలని వెంకటేశ్వర్లు కోరారు. సంఘం రాష్ట్ర సమన్వయకర్త, రిటైర్డు ఐఆర్‌ఎస్ అధికారి బాణావత్ చిన్నస్వామి నాయక్ మాట్లాడుతూ గిరిజనులు విద్యకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. డిప్యూటీ కలెక్టర్ కె. రాములు నాయక్, జాతీయ కమిటీ అధ్యక్షులు పి.వి. రమణ, జాతీయ



మాట్లాడుతున్న జాతీయ నాయకులు పివి రమణ

కార్యదర్శి హరిరామ్ నాయక్, ఉపాధ్యక్షులు డాక్టర్ బి.లక్ష్మానాయక్, పి.చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలపై సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర ప్రెసిడెంట్ భూక్యా బాలు నాయక్ , ప్రధాన కార్యదర్శి దినారి ప్రభాకర్, ఉపాధ్యక్షులు ఇండ్ల సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయ్యాల శ్యాం వరప్రసాద్, రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శి మొగలి శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్స్ డాక్టర్ బాలాజీ నాయక్ బానోత్, రాష్ట్ర కమిటీ మాజీ అధ్యక్షులు పేరం పవన్ కుమార్ హాజరు అయ్యారు. సంఘం నాయకులు మూడవత్ కోటేశ్వరరావు నాయక్, పాలపర్తి శ్రీనివాస్ రావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, కాంద్ర కొండ కోటయ్య, కుంభ ముత్తయ్య, తుపాకుల లక్ష్మీనారాయణ, ఐడిబి నాయక్, పాలపర్తి ఇందిర, మేడా జయలక్ష్మి ,దేవరకొండ నీలిమ ప్రసన్నలత ప్రసంగించారు. వివిధ జిల్లాలకు చెందిన ఉద్యోగులు హాజరు అయ్యారు.

రుమటాయిడ్ ఆర్థరైటిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

రుమటాయిడ్ ఆర్థరైటిస్ పట్ల జాగ్రత్త వహించకపోతే ప్రాణాంతకం అయ్యే అవకాశం ఉందని రుమటాలజిస్ట్ డాక్టర్ దీపిక అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో జరిగిన కీళ్ళు, కండరాల నొప్పులపై ఆరోగ్య సభలో రుమటాలజిస్ట్ దీపిక మాట్లాడుతూ సాధారణంగా మన శరీరంలో ఉన్న వ్యాధి నిరోధక శక్తి బయటనుంచి వచ్చే వైరస్, వివిధ రకాల ఇన్ఫెక్షన్లపై పోరాడి మన ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అలా కాకుండా ఎప్పుడైతే మనలోని వ్యాధి నిరోధకశక్తి, మంచి కణాలను, కణజాలాలను పాడుచేసే విధంగా మార్పు చెందుతుందో దానివల్ల వచ్చే వ్యాధులను ఆటో ఇమ్యున్ డిసీజెస్ అంటారని తెలిపారు. కీళ్లవాతం, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో పోరాసిస్, గౌడ్, సోరియాటిక్ ఆర్థరైటిస్, యాంకలోసిస్ ఆర్థరైటిస్, ఐబీడీ ఆర్థరైటిస్ ఇమ్యూన్ డిసీజెస్ క్రిందకు వస్తాయని తెలిపారు. ఈ రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి ఒక్క కీళ్ళకు మాత్రమే కాకుండా మన శరీరంలోని కళ్ళు, గుండె, ఊపిరితిత్తులు మొదలైన అన్ని అవయవాలకూ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దీనివల్ల మనకు నొప్పి, వాపు, పట్టుకు పోయినట్లుగా ఉండటం, నొప్పి ఎక్కువ సమయం ఉండటం లాంటి లక్షణాలు మనలో కనబడినప్పుడును దాన్ని ఆర్థరైటిస్‌గా అనుమానించి వెంటనే అందుబాటులోని రుమటాలజిస్టును సంప్రదించాలన్నారు. ఈ వ్యాధికి సాధారణంగా జీవితాంతం మందులను వాడుకోవాల్సిన వస్తుందని వివరించారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ రావడానికి కారణాలు వివరిస్తూ సాధారణంగా వయస్సు, బరువు, ఆ వ్యక్తి ఎల్లప్పుడూ ఉండే పొజిషన్,



మాట్లాడుతున్న డాక్టర్ దీపిక

జెనెటిక్ డిజార్డర్స్, మోకాళ్ల దెబ్బకి గురైనప్పుడు ఈ రుమటాయిడ్ ఆర్థరైటిస్ వచ్చే అవకాశం ఉందని వివరించారు. సాధారణంగా యూరిక్ యాసిడ్ స్థాయి ఏడులోపు ఉండాలని కానీ ఆ స్థాయి పెరిగితే కీళ్లవాతంకి దారితీస్తుందని సాధారణంగా బిపి, షుగర్ వ్యాధులు ఉన్నవారికి, మద్యపానం, మాంసాహారం తీసుకునే అలవాటు ఉన్నవారికి ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రోజూ క్రమం తప్పకుండా, పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకుంటూ, దూమపానం, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉంటే ఈ వ్యాధికి దూరంగా ఉండవచ్చన్నారు. అనంతరం డాక్టర్ దీపికను అవగాహన సభ్యులు సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, అవగాహన సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రామచంద్రయ్య ప్రసంగించారు.

దేశాభివృద్ధిలో మన్మోహన్‌సింగ్ పాత్ర కీలకం

జనచైతన్య ఆధ్వర్యంలో సంస్మరణ సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి కి కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణను సంస్కరణలు ప్రగతి బాట పట్టించాయని మాజీ మంత్రి డొక్కా మాణిక్ వర ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఆయన చేపట్టిన సంస్కరణ లతో భారతదేశ ఆర్థిక రంగాన్ని ప్రగతి బాట పట్టించిన దార్శనికుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఆదివారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో జరిగిన మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ లో ఆయన మాట్లాడారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. వరప్రసాద్ ప్రసంగిస్తూ డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత ప్రధానిగా ఉపాధి హామీ పథకాన్ని, సమాచార హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చిన సింగ్ నిజాయితీ, నిరాడంబరతకు నిలువుటద్దం అన్నారు. విదేశీమారక ద్రవ్య నిల్వలు అట్టడుగు స్థాయికి చేరి ప్రపంచంలో అప్రతిష్టపాలు అవుతున్న సమయంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ సంస్కరణలు భారత జాతి ఖ్యాతిని పెంచిందన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న అవార్డును అందించాలని అన్నారు. ఢిల్లీలో డాక్టర్ మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ఆర్థిక



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరెడ్డి తదితరులు

నిపుణులు ప్రొఫెసర్ డి ఎ ఆర్ సుబ్రహ్మమన్యం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి. రామచంద్ర రాజు, ఇండియన్ టొబాకో అసోసియేషన్ సెక్రటరీ యార్లగడ్డ అంకమ్మ చౌదరి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్, కోవిడ్ ఫైటర్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లాబక్షు, ప్రొఫెసర్ అరవింద్ లు ప్రసంగించారు. తొలుత భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



క్రీడాకారునికి ఎమ్మెల్యే నసీర్ ఆర్థికసాయం

ప్రజాశక్తి-గుంటూరు

లడక్‌లో 2025 లో జరగబోయే 42కె మారథాన్ రన్నింగ్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత పొందిన షేక్ అబ్దుల్లాను ప్రోత్స హించేందుకు గుంటూ రు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లా డుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఒక సామాన్య కుటుంబానికి చెందిన షేక్.అబ్దుల్లా మారథాన్ రన్నింగ్‌లో జిల్లాస్థాయిలో 8 స్వర్ణ పతకాలు, రాష్ట్రస్థాయిలో 4 పతకాలు, జాతీయ స్థాయిలో 8పతకాలు సాధించి లడక్ మారథాన్‌కు ఎంపి కయ్యాడన్నారు. లడక్ లో జరగబోయే మారథాన్‌లో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఎపిజిఇఎ కేలండర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్ -2025 కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులకు అవసరమైన సమాచారంతో క్యాలెండర్ రూపొందించటం అభినందనీయమని తెలియజేస్తూ, అసోసియేషన్ నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దంత వైద్యులు డాక్టర్ విజయచంద్ర సౌజన్యంతో ఉద్యోగులకు ఉపయోకరంగా ఉండేలా పబ్లిక్ హాలిడేస్, ఐశ్చిక సెలవు దినాలు పొందుపరిచి ఈ క్యాలెండర్ రూపొందించినట్లు ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సుమిత్రాదేవి, మంగళగిరి యూనిట్ అధ్యక్షులు మురళి, తాడికొండ తాలూకా యూనిట్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా డిసిప్లినరీ కమిటి చైర్మన్ రామిరెడ్డి పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎపిజిఇఎ నాయకులు



ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరించకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత 31 సంవత్సరాలుగా తమ సమస్యను పరిష్కారం చేయాలని, న్యాయపోరాటం చేస్తున్న ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరించకుంటే, జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి పట్టణంలో ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎసిసి కార్మికులు తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం దీర్ఘకాలికంగా పోరాడుతున్నారని పాలక పక్షాలు కార్మికుల సమస్య పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే 160 మంది ఎసిసి కార్మికులు అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులతో మరణించారని ఆయన అన్నారు. ఎసిసి యాజమాన్యం,రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎసిసి కార్మికుల న్యాయమైన సమస్యను వెంటనే పరిష్కరించాలని రామారావు డిమాండ్ చేశారు. ఈ దీక్షలలో పిచ్చయ్య, సుబ్బారావు, సాంబశివరావు, ఎస్ కే భాష, నాగేశ్వరరావు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, ఈ నరసింహారావు, నీరుడు దుర్గారావు, వి శాస్త్రి, దర్శనపు విజయ బాబు, ఎసిసి కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, ఆశీర్వాదం, బి సూర్యప్రకాష్, దుర్గ భవాని, సారమ్మ శారద, రమాదేవి, అంకయ్య, సుబ్బారావు, రమణ, సాంబశివరావు, గురవయ్య, సుభాని, ఇస్మాయిల్, దర్శి మాణిక్యాలరావు, నవనీతం, కృష్ణ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు

31న రాత్రి హద్దు మీరితే కఠిన చర్యలు :ఎస్ఐ

ప్రజాశక్తి - రెంటచింతల

నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎస్ఐ సిహెచ్ నాగార్జున పలు సూచనలు చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 31న రాత్రి బహిరంగ ప్రదేశాల్లో రహదారులపై వేడుకలు నిర్వహించొద్దన్నారు. మద్యం తాగి, సైలెన్సర్లు లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, బైకు రేసులకు పాల్పడిన వారి వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 31వ తేదీ అర్ధరాత్రి ఎవరూ బయటకు రావడానికి వీల్లేదని, డీజే, లౌడ్ స్పీకర్లు ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగించేలా నృత్యాలు చేయవద్దని సూచించారు.



గౌతు లచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న బిసి సంఘాల నేతలు

గౌతు లచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గుంటూరు

నూజివీడులో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని అవమానపరిచే విధంగా జరిగిన దుశ్చర్యకు ప్రక్షాళనగా బిసి సంక్షేమ సంఘం పిలుపు మేరకు గుంటూరు బస్టాండ్ వద్ద ఉన్న గౌతు లచ్చన విగ్రహానికి పాలాభిషేకం చేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు మాట్లాడుతూ నూజివీడులో విగ్రహ కార్యక్రమం దిగ్విజయంగా జరిగిందని, బీసీల ఐక్యతను చూసి ఓర్వలేని ఆధిపత్య శక్తులు ఆ కార్యక్రమాన్ని, మహనీయుడు గౌతు లచ్చన్నను అవమానపరిచే విధంగా వ్యవహరించారన్నారు. ఆకార్యక్రమంలో పాల్గొనడమే తప్పు అనే విధంగా ప్రచారం చేశారన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీలు అందరూ ఐక్యంగా రాజకీయ పార్టీలకు అతీతంగా లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడాన్ని చూసి సహించలేని ఆధిపత్య కుల శక్తులు మొత్తం కార్యక్రమాన్ని బీసీల ఐక్యతని కించపరిచే విధంగా వ్యవహరించారన్నారు. భవిష్యత్తు లో లచ్చన్న స్ఫూర్తి బీసీలు అందర్నీ ఐక్యం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది వై.కె, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, వివిధ సంఘాల ప్రతినిధులు అనుమోలు ఏడుకొండలు, జూపూడి శ్రీనివాసరావు, చినతనగండ్ల వాసు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి : పల్నాడు ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా ఎస్.పి కె.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని పేర్కొన్నారు. ఎవరైనా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్ణయించిన సమయం వరకే తెరచి ఉంచాలని సూచించారు. పోలీసులూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.



సమాజానికి పత్రికలు దిక్సూచి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రజాశక్తి రూపొందించిన 2025 కేలండర్‌ను విజయపురిసౌత్‌లోని మాత సరోవర్ రిసార్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేరిరెడ్డి వీరారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు సమాజానికి దిక్సూచిలా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని, అటువంటి పత్రికా రంగంలో ఎంతో విలువైన పాత్ర పోషిస్తున్న ప్రజాశక్తి ఉన్నతమైన ప్రత్యామ్నాయ విధానాల కోసం పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాశక్తి పల్నాడు డివిజన్ ఇన్‌ఛార్జి ఎన్.కృష్ణ, విజయపురిసౌత్ విలేకరి ప్రసాద్, మాత సరోవర్ రిసార్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.







పిల్లల సంబరాలు.. అదరగొట్టేలా ప్రదర్శనలు..

నరసరావుపేటలో రెండ్రోజులపాటు నిర్వహించిన పల్నాడు బాలోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాల ప్రాంగణంలో అరమరికల్లేకుండా స్వేచ్ఛగా సంచరించిన బాలలు బహుముఖ అంశాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించి సరికొత్త స్ఫూర్తిని పొందారు.



















పల్నాడు డొక్కా సీతమ్మ జెట్టి కోటేశ్వరమ్మ : బాలోత్సవ కమిటీ

బాలోత్సవాల నిర్వహణకు, అతిథులకు, చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు భోజన సదుపాయం కోసం రూ.3 లక్షల విరాళం అందజేసిన జెట్టి కోటేశ్వరమ్మ, ఆమె కుమార్తె సునీతను పల్నాడు బాలోత్సవ కమిటీ సత్కరించింది. పల్నాడు డొక్కా సీతమ్మ.. కోటేశ్వరమ్మ అని సభ్యులు అభినందించారు. సునీత మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు అభ్యుదయ భావాలు నింపడం కోసం బాలోత్సవం చేస్తున్న కృషిని కొనియాడి ఇందుకు తాము సహకరించామని చెప్పారు. రాబోయే రోజుల్లోనూ తమ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

తల్లిలేని నాకు ఇక్కడ మంచి స్నేహితులు

ప్రియాంక, 8వ తరగతి, కెజిబివి, నాదెండ్ల.



బాలోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. తల్లి లేని నేను ఏమైనా కష్టం వస్తే చెప్పుకోవడానికి కార్యక్రమం ద్వారా స్నేహితులతో మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. గతేడాదికూడా బాలోత్సవంలో పాల్గొన్నాను. ఇందులో పాల్గొనేందుకు టీచర్లు అన్ని విధాలా ప్రోత్సహించడం నాకు మరింత సంతోషాన్నిచ్చింది. పాఠశాలలో కూడా బాలోత్సవం మాదిరి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుంది.

ధైర్యంగా ముందడుగు వేయడం కోసం బాలోత్సవానికి

షేక్ మెహదాన్ షిజాహ్, 6వ తరగతి, ఐగ్రో ఇంటర్ నేషనల్ స్కూల్, నరసరావుపేట.



బాగా చదువుకోవడంతో పాటు ప్రతి రంగంలో ముందుండాలి. ధైర్యంగా ముందడుగు వేయాలని తాతయ్య మీరావలి, నాన్న షరీఫ్ చెబుతుంటారు. ఈ క్రమంలో ఎవరిలా ఉండాలని నాన్నను అడిగితే వీరనారి రాణి రుద్రమదేవిలా ఉండాలని చెప్పారు. తాతయ్యతో రాణి రుద్రమదేవి చరిత్ర కొంత తెలుసుకున్నాను. అందుకే వీరనారి వేషంలో జానపద నృత్యం - విజయీభవ పాటకు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నా. వేలాది మంది సమక్షంలో ప్రదర్శన ఇవ్వడం సంతోషంగా ఉంది. **(ప్రజాశక్తి-పల్నాడు జిల్లా)**







దేశ సమైక్యత, మత సామరస్యం కోసం సిపిఎం విస్తృత ప్రచారం

తాడేపల్లి రామయ్య కాలనీలో ప్రారంభించిన పాశం రామారావు, బూరుగ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలందరూ ఐక్యంగా కృషి చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. ఆదివారం ఎంటిఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం, రామయ్య కాలనీ లో సిపిఎం పార్టీ శ్రేణులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ, కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు వేముల దుర్గారావు అధ్యక్షతన కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. అంతేకాకుండా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడంతో సామాన్య ప్రజానీకం పై ధరల భారం పడిందని విమర్శించారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రజలందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని సిపిఎం పార్టీ పిలుపునిచ్చిందన్నారు. అదేవిధంగా ఇటీవల పార్లమెంటు లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను వ్యంగ్యంగా విమర్శిస్తూ మాట్లాడిన అమిత్‌షాను మంత్రి పదవి నుండి తొలగించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని, భారత రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించటం


మాట్లాడుతున్న పాశం రామారావు

దుర్మార్గమన్నారు. అంతేకాకుండా హిందూ ముస్లిం క్రైస్తవుల మధ్య అగాధాన్నీ సృష్టిస్తూ, మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం బిజెపి దిగజారుడు తనానికి నిదర్శనంగా మారిందని ఆయన విమర్శించారు. మతసామరస్యాన్ని మంటగలుపుతున్న ఇలాంటి శక్తులను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా, ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. ఉచిత ఇసుక వాగ్దానాన్ని అమలు చేస్తామని చెప్పి అమలు చేయకపోగా, వాడ వాడలా బెల్టు షాపులు పెట్టి మద్యం విక్రయాలను విచ్చలవిడిగా చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా తాడేపల్లి పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ భూములలో ఇల్లు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి, స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ మాట తప్పారని అన్నారు. తాడేపల్లి పట్టణ సిపిఎం సీనియర్ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఎసిసి కార్మికులు తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని దీర్ఘకాలికంగా పోరాటం చేస్తున్న సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేముల వెంకన్న, ఎస్.కె రహంతాబి, వేముల రమణ, విజయ్ బాబు, వి. శాస్త్రి, దేవకుమార్, జానీ, ఆఫీజ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిపిఎం శ్రేణులు ఇంటింటికి తిరిగి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.


గుంటూరులో యాత్రను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు



తెనాలిలో

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయండి

గుంటూరులో ప్రచార జాతాను ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు : ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ వికాసం సాధించడంలో, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు సౌకర్యాలు సాధించడంలో యుటిఎఫ్ క్రియాశీల పాత్ర పోషిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా జనవరి 5-8 వరకూ కాకినాడలో జరిగే రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయం నుండి చేపట్టిన యాత్రను ఎన్.వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య విగ్రహానికి రాష్ట్ర సహాధ్యక్షులు ఏ.ఎన్.కుసుమ కుమారి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కులం, మతం ,ప్రాంతం, భాష, రంగు, లింగ వివక్షత లేని సమాజం స్థాపన లక్ష్యంగా 1974 ఆగస్టు 10 న యుటిఎఫ్ స్థాపించడం జరిగిందని తెలిపారు.అప్పటి నుండి ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయటంతోపాటు, సామాజిక దృక్పదంతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఉపాధ్యాయులకు రిగ్రూపింగ్‌స్కేల్, అప్రెంటిస్ విధానం రద్దు, కౌన్సిలింగ్ విధానం తీసుకురావటంలో యుటిఎఫ్ కీలక భూమిక పోషించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకోవటానికి జరిగే మహాసభల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.ఎన్.కుసుమకుమారి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో పేద ప్రజలకు అండగా యుటిఎఫ్ నిలిచిందని, వరద సహాయ కార్యక్రమాల్లో తోడ్పాటును అందించినట్లు చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ విభాగం చైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కషిచేస్తూనే, విద్యార్థుల్లో సజనాత్మకతను పెంచేదాని కోసం, మంచి నాణ్యమైన విద్య అందించడం కోసం యుటిఎఫ్ పని చేస్తుందన్నారు. అందులో భాగంగా ప్రతి ఏటా 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లు విద్యార్థులకు అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు ప్రసంగించారు. యాత్ర చేబ్రోలు, పొన్నూరు, తెనాలి మీదగా విజయవాడ వెళ్లింది. ఈప్రచార యాత్రలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, జిల్లా కార్యదర్శులు జి. వెంకటేశ్వరరావు, ఎ.ఆదినారాయణ, కే.సాంబశివరావు, కె.రంగారావు, గోవిందు, ప్రేమ్ కుమార్, షకీల బేగం, పివి శ్రీనివాసరావు ,ఎండి గయాసుద్దౌలా, జితేంద్ర, కేదార్‌నాథ్ పాల్గొన్నారు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెనాలిలో ఆదివారం యుటిఎఫ్ రాష్ట్ర మహాసభల ప్రచార జాతా నిర్వహించారు. గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు తెనాలి వైకుంఠపురం నుండి జాతా ప్రారంభించారు. జనవరి 5 నుంచి 8 వరకు కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించ నున్నారని వెంకటేశ్వర్లు తెలిపారు. మహాసభలకు రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు, ఆర్థికవేత్తలు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరౌతారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా యూటీఎఫ్ మహాసభలకు సుమారు 25వేల మంది కార్యకర్తలు హాజరవ్వనున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు కె కుసుమకుమారి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు రాజేశ్వరరావు, జిల్లా కోశాధికారి మహమ్మద్ గయా సుద్దేలా, జిల్లా కార్యదర్శిలు ఆదినారాయణ, కె సాంబశివరావు, కె కేదార్నాథ్, కె కామాక్షి, జి వెంకటేశ్వరరావు, బసవేశ్వరరావు, ఎండి హుస్సేన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐఎంఎ నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గొప్ప వ్యక్తులు తమ మరణానంతరం నక్షత్రాల్లా ప్రకాశిస్తూనే ఉంటారని ప్రముఖ సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ దక్షిణామూర్తి అన్నారు. డాక్టర్ మేజర్ కాకుమాను ఉల్లక్కి సేవలును గుర్తు చేసుకుంటూ ఐఎంఎ తెనాలి శాఖలో ఆదివారం 2025 నూతన క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. ఉల్లక్కి జీవిత స్ఫూర్తిని స్మరించుకుంటూ తెనాలి పట్టణానికి ఆయన చేసిన సేవలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి అధ్యక్షులు డాక్టర్ కె అనిల్ కుమార్ తెలిపారు. కేవలం వైద్యుడిగానే కాకుండా సంఘసంస్కర్తగా పలు బ్యాంకుల్లో గౌరవ అధ్యక్షుడిగా పని చేసారని డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో మిలిటరి వైద్యాడిగా దేశానికి అనేక సేవలు అందించారని వక్తలు కొనియాడారు. ఐఎంఎ జనరల్ సెక్రెటరి డాక్టర్ జి మధు ప్రభాకర్ బాబు, వైస్ ప్రెసిడెంట్ పవని ప్రియాంక, జాయింట్


కేలండర్ అవిష్కరిస్తున్న ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దక్షిణామూర్తి తదితరులు

సెక్రెటరి డాక్టర్ చందు ఉదయ, డాక్టర్ కోటి నాగయ్య, డాక్టర్ సాంబి రెడ్డి, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ గంట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా నేడు ధర్నా

జయప్రదం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ 30వ తేదీన తాడేపల్లి ఎంటిఎంసి కార్యాలయం ఎదుట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని వామపక్షాల నాయకులు శనివారంతెలిపారు. ఈ మేరకు తాడేపల్లి సిపిఎం కార్యాలయంలో మేకా అమరా రెడ్డి భవన్ లో సిపిఎం, సిపిఐ, ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, ఎంఎల్ పార్టీ నాయకులు కె. ఆదినారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకు పోవడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగంపై గౌరవం లేదని విమర్శించారు. అమిత్ షా వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. 30వ తేదీన జరిగే కార్యక్రమానికి ప్రజాతంత్ర వాదులు, లౌకికవాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు వేముల దుర్గారావు,డి వి భాస్కర్ రెడ్డి,కె. బాబురావు,డి. విజయ్ బాబు, కె. మేరీ, దేవకుమారి, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాల పంపిణీలో పాల్గొన్న సిపియం నాయకులు

విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయటానికి ఒక పథకం ప్రకారం తీసుకొస్తున్న స్మార్ట్ మీటర్లు, ఇతర విద్యుత్ సంస్కరణలను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు ఎస్.కె.అబ్దుల్ సలీం కోరారు. శనివారం స్థానిక ఆర్టీసి కాలనీలోని వైఎస్ఆర్ పార్క్ వద్ద విద్యుత్ సంస్కరణలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశల వారీగా మొదట వాణిజ్య భవనాలకు తర్వాత గృహ సముదాయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం పథకం ప్రకారం వ్యవహరిస్తుందని విమర్శించారు. పేదల ఇళ్లకు బిగించబోమని చెబుతూనే సుందరయ్య నగర్‌లో నిరుపేదల ఇళ్లకు బిగించారని, దీనిపై పోరాటం చేయగా ఉపసంహరించుకున్నారని తెలిపారు. అదానీ కంపెనీకి లాభాలు చేకూర్చటానికి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని, వీటికి అయ్యే ఖర్చును కూడా ఒక్కో ఇంటి నుండి రూ.10వేల నుండి రూ.15వేలు వసూలు చేస్తారన్నారు. రాబోయే కాలంలో గంటల వారీగా విద్యుత్ చార్జీలు నిర్ణయించి బిల్లులు వడ్డిస్తారన్నారు. కావున ప్రజలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నెహ్రూ నగర్ శాఖ కార్యదర్శి టి.రాధ, సభ్యులు నక్కా మస్తాన్, కె.వాసు స్థానికులు మల్లికార్జునరావు, కృష్ణప్రసాద్, శ్రీనివాసరెడ్డి, సాయి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



అధ్వాన రహదారితో అవస్థలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక కళామందిర్ సెంటర్ నుంచి చీరాల వెళ్లే ప్రధాన రహదారిలో నరసింహస్వామి గుడి మలువు వద్ద రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలు ఏర్పడటంతో నాలుగు చక్రాల వాహనాలు దిగబడుతున్నాయి. ఇటీవల ఆ గుంతల్లో మున్సిపాలిటీ వారు రాళ్లతో కూడిన మట్టి వే శారు. దీనివల్ల మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనచోదకులు చెబుతున్నారు. ఏళ్లుగా ఈ రహదారి సమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ గుంతలను పూర్తిగా పూడ్చి, తారు వేయవలసిందిగా కోరుతున్నారు.



రవికుమార్‌కు 'భరత కళారత్న'

ప్రజాశక్తి - సత్తెనపల్లి

పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు నల్గొండకు చెందిన పుడమి సాహితీ వేదిక 'భరత కళారత్న' జాతీయ గౌరవ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఖమ్మం జిల్లా ముదిగొండ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన పుడమి సాహితీ వేదిక 6వ వార్షిక వేడుకల్లో పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యం, కళలు, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, కవిత్వం, గాత్ర విభాగాల్లో ప్రావీణ్యం పొందిన వారికి భారత విద్యారత్న, భారత కళారత్న, సాహితీ సేవా రత్న పురస్కారాలను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్త రామదాసు 10వ తరం వారసులు కంచెర్ల శ్రీనివాసు, మానవ హక్కుల అధ్యక్షురాలు (తెలంగాణ శాఖ) చెల్లమల హైమావతి, సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవి కుమార్‌కు పౌరాణిక రంగంలో వివిధ పాత్రలు ధరించి, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులను రంజింపజేసినందుకు పురస్కారానికి ఎంపిక చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండలంలోని కొండవీడు, స్పైసస్ పార్క్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో సోమవారం పుట్టకోట, కొత్తపాలెం, కోట, సొలస, లింగారావుపాలెం, చెంగిజ్‌ఖాన్ పేట్, వంకాయలపాడు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐటీ రంగంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- మాచర్ల

ఐటీ రంగంలో రాణించాలనుకున్న విద్యార్థులకు హైదరాబాద్ ఇన్ఫినిటీ మెగా టెక్నాలజీస్ సీఈవోలు సుభాన్, రుక్సానా దిశా నిర్దేశం చేశారు. ఆదివారం స్థానిక న్యూటన్స్ ఇంజనీరింగ్ కాలేజ్, ఎస్వీఆర్, వికాస్ డిగ్రీ కాలేజీల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిటెక్, డిగ్రీ తర్వాత సాఫ్ట్‌వేర్ రంగంలోకి ఏ విధంగా రావాలి, ఏయే కోర్సులు తీసుకుంటే భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయో తెలియజేశారు.

విద్యారంగంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర







- టీచర్ల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కృషి అభినందనీయం
- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాల మహోత్సవం
- స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

చిత్రాలు(వరుసగా) : ప్రతిభా పురస్కారాలతో ఉపాధ్యాయులు, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, స్వర్ణోత్సవ సభల విజయవంతానికి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - వినుకొండ

విద్యారంగంలో కీలక పాత్ర ఉపాధ్యాయులదేనని.. వారికి ప్రత్యామ్నాయం లేదని కృష్ణా, గుంటూరు శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. మన దగ్గరకు వచ్చే పేద పిల్లలకు విద్యను అందించడమే ప్రథమ కర్తవ్యంగా భావించాలని చెప్పారు. కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్, గుంటూరు, వినుకొండ యూటీఎఫ్ ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జాషువా కళా ప్రాంగణంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.రవిబాబు అధ్యక్షతన ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు చేతుల మీదగా వినుకొండ నియోజకవర్గంలోని 33 మంది ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్.అజయ్‌కుమార్, సభ్యులు పి.ఎ.జిలానీ, రాష్ట్ర కౌన్సిలర్ డి.వి.లింగయ్య, అయిదు మండలాల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, విశ్రాంత ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, జి.నాగేంద్రుడు, మండల విద్యా శాఖాధికారులు సయ్యద్ జఫరుల్లా, ఎం.సాంబశివరావు, కె.పార్వతి పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాత

యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకొంటోంది. జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో కాకినాడలో అట్టహాసంగా జరగబోతున్న రాష్ట్ర మహాసభల ప్రచార జాత పల్నాడు జిల్లాలోని వినుకొండకు ఆదివారం చేరుకుంది. వినుకొండ పురవీధుల్లో జాతాను ఎమ్మెల్సీ లక్ష్మణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రాంతీయ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు అప్పరాజు నాగేశ్వరావు పతాకావిష్కరణ చేశారు. జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ రావు, జిల్లా సహాధ్యక్షులు నాయక్, కోశాధికారి ఎం.రవిబాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- మాచర్ల

యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని చేపట్టిన ప్రచార జాతాకు మాచర్ల వద్ద స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సెలర్ పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ విధానాలపై చర్చలు జరుగుతాయన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమాలకు పురిటి గడ్డయిన మాచర్ల ప్రాంతం నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ రావు, కార్యదర్శి నాసరరెడ్డి, శ్రీనివాసరావు, మాచర్ల నాయకులు నసీర్, ఆదినారాయణ తదితరులు మాట్లాడారు. పాత పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలని.. ఐఆర్, 12న వేతన సవరణ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మాచర్ల ప్రాంతీయ కార్యాలయ ఆవరణలో జెండాను సీనియర్ నాయకులు నాగరాజు ఆవిష్కరించారు.



పల్నాడు జిల్లా : వచ్చే నెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రేమ్ కుమార్ పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతానికి సన్నాహక ర్యాలీని నిర్వహించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం అరండల్‌పేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద పతాకాన్ని సీనియర్ నాయకులు ఎన్.స్లీవరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో రెండవసారి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు ముఖ్యమంత్రి హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు వాల్యా నాయక్, భాగేశ్వరీదేవి, టి.వెంకటేశ్వర్లు, కె.ఉషా శౌరి రాణి, జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో గన్నవరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్



పల్నాడు బాలోత్సవంలో మాచర్ల మండలం గన్నవరం పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. శనివారం పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట కొత్త రఘురామయ్య కళాశాలలో పల్నాడు బాలోత్సవం నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించగా.. గన్నవరం ఎంయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి, కలెక్టర్ అరుణ్‌బాబు, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యులు అరవింద్‌బాబు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్నారు.

సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- మాచర్ల

సర్వీస్ ప్రొవైడర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందుతాయని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్ కేంద్రాన్ని ఛైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో పనులులేని వారికి ఉపాధి కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రూ.1000 ఫీజుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వండ్రంగి, ప్లంబింగ్, విద్యుత్, బ్యూటీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్లు, టీవీ రిపేర్లు చేసేవారు తగిన సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా రాజశేఖర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

'కళాకారులకు అండగా ప్రభుత్వం'

ప్రజాశక్తి - వినుకొండ

కళాకారులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకులు పి.దాసయ్య తెలిపారు. ప్రముఖ రంగస్థల కళాకారిణి పి.కృష్ణవేణి మూడో వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు మందా వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాసయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం క్రీస్తు చరిత్ర, బ్రహ్మంగారి నాటకం, చింతామణి, సత్య హరిచంద్ర తదితర నాటకాలను ప్రదర్శించారు. కళాకారులు పి.సంజీవయ్య, బి.కోటేశ్వరరావు, ముట్లూరు రామచంద్రయ్య, అంబటి కోటిరెడ్డి, ఎస్.ఎం.రాజు తదితర కళాకారులు పాల్గొన్నారు.



నాటకంలో ఓ సన్నివేశం



కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు..

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

శరీర భాగాల్లో కీలకమైన కంటి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని.. నిర్లక్ష్యం వహించవద్దని ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. స్థానిక పుతుంబాక భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. నేడు వయసుతో నిమిత్తం లేకుండా మనం ఊహించని వ్యాధులొస్తున్నాయని.. పిల్లలకు కూడా బీపీ, షుగర్, కంటి సమస్యలు ఇందుకు ఉదాహరణని చెప్పారు.డాక్టర్ ఎంవి రెడ్డి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎం.వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఎంతో సున్నితమైన కంటివ్యాధులను ఏ మాత్రం అశ్రద్ధ చేసినా శాశ్వతంగా చూపును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశారావు మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. వేసవిలో మజ్జిగ చలివేంద్రాల నిర్వహణ, తరచూ వైద్యశిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా 110 మందికి కంటి పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్ర అధ్యక్షులు గద్దె చలమయ్య, మాధవి, ఐద్వా నాయకులు జి.ఉమశ్రీ, రజని, డివైఎఫ్ఐ నాయకులు రాజకుమార్, నాగేశ్వరావు, రాము, సిఐటియు పట్టణ కార్యదర్శి హరిపోతురాజు పాల్గొన్నారు.



ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మంగళగిరి

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఎంఎంకె స్టేడియంలో మందడం హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ జెడ్పిటీసీ సభ్యురాలు ఆకుల జయసత్య, తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ రహీమ్ బాషా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్టేడియం ఇన్చార్జి కొత్తపల్లి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఎంటీఎంసీ కార్యదర్శి తిరుమలశెట్టి మురళీకష్ణ, స్టేడియం ప్రతినిధులు మాచర్ల శ్రీనివాసరావు, వుడతా శ్రీనివాసరావు, కొల్లి పూర్ణ, సైదా నాయక్, నాగేశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



మెగా శిబిరంలో 1,200 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి-మంగళగిరి

మానవ సేవా సంస్థ, అంజుమాన్ ఈ హిమాయత్తుల్లా ఇస్లాం సంయుక్తంగా గౌతమ్ బుద్ధ రోడ్డులోని షాదీ ఖానా వద్ద ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో సుమారు 1,200 మందికిపైగా ఉచిత వైద్యసేవలు అందించారు. అనేక విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని, ఉచితంగా వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అక్రమ్, మానవ సేవా సంస్థ అధ్యక్షులు వంగర సురేష్ కుమార్, పట్టణ ఎస్సై రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సార్.. మాకు బ్యాడ్మింటన్ కోర్టు కావాలి...

ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌ను కోరిన చిన్నారులు

ప్రజాశక్తి - తుళ్లూరు

'సార్..మాకు బ్యాడ్మింటన్ కోర్టు కావాలని..' ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ను చిన్నారులు కోరారు. రాజధాని అమరావతి పరిధిలోని మందడం టిడ్కో గృహసముదాయాల వద్ద ఏర్పాటైన ఎన్‌టీఆర్ సుజల నీటి పథకాన్ని శ్రావణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన వద్ద ఏకరువు పెట్టారు. గృహ సముదాయాల వద్ద కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయని.. రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా పోయిందని చెప్పారు. సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. 5, 6 తరగతులు చదువుతున్న చిన్నారులు ఆయన వద్దకు వచ్చి, తమకు ఆడుకునేందుకు బ్యాడ్మింటన్ కోర్టు కావాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న చిన్నారులు

యువత మేధస్సుకు పదును పెట్టాలి

ప్రజాశక్తి- తెనాలి రూరల్

దేశానికి ఉపయోగపడే విధంగా యువత తమ మేధస్సుకు పదునుపెట్టాలని తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, పట్టణానికి చెందిన కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలో జరిగిన 20వ మెరిట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ఉపయోగపడేవారంతా దేశభక్తులు అన్నారు. యువత ఆలోచనలు దేశానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. కనీసం ఐదు శాతం ఉత్తేజంతో తమ మెదడుకు పదునుపెడితే మరో ఐన్‌స్టీన్ కాగలరని చెప్పారు. దేశానికి ఉపయోగపడాలనే సంకల్పంతో యువతకు ఇటువంటి స్కాలర్‌షిప్‌లు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.జగదీష్‌బాబు మాట్లాడుతూ దేన్నయినా సాధించగలమన్న సంకల్పాన్ని బాల్యం నుంచి అలవర్చుకుంటే విజయం సొంతమవుతుందని చెప్పారు. గతంలో లేని విద్యా సదుపాయాలు ప్రస్తుతం మెండుగా ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. సుమారు 341 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగిశెట్టి ఫౌండేషన్ తరపున రంగిశెట్టి రమేష్ తులసి చంద్రప్రభుకు అభినవ శ్రీకృష్ణదేవరాయ బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో బొల్లిమంత వెంకటనారాయణ, చింతల శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్ర, అరవ రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. వి.నిత్యసంతోషి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, విజయనగరం జిల్లాకు చెందిన జి.వినోద్ కుమార్ ఆలపించిన గజల్స్ అందర్నీ అలరించాయి.



పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - తాడికొండ

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 1999 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం రజతోత్సవ వేడుకలను పాఠశాలలో ఘనంగా జరుపుకొన్నారు. 25 ఏళ్ల క్రితం గురుకుల పాఠశాలలో తాము నేర్చుకున్న పాఠాలు, క్రమశిక్షణ, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ఆనాడు ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ తమను ఉన్నత శిఖరాలకు చేర్చిందని వారంతా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. తాము వివిధ రంగాలలో స్థిరపడటానికి పునాది ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల విద్య అని గుర్తు చేసుకున్నారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కడప మున్సిపల్ అదనపు కమిషనర్ కె.రాకేష్, రమణ. కె.ఆర్.దేశాయ్, రవికుమార్, ప్రభాకర్‌రావు, వెంకటరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మంగళగిరి

తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం టిప్పర్ల బజారులోని సీఐటీయూ కార్యాలయంలో క్రాప్ ఆటో డ్రైవర్ల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా వ్యర్థాలను తరలిస్తూ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్నారని.. అవి కూడా నెలలు తరబడి పెండింగులో ఉంచుతూ అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే వారికి రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ ఏడాది నుంచి అమలు చేయట్లేదన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు శివ, రవి తదితరులు పాల్గొన్నారు.



స్కేటర్ జెస్సీరాజ్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-మంగళగిరి

అంతర్జాతీయ స్కేటింగ్ వేదికపై అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి, క్రీడా ప్రముఖుల మన్ననలు పొందిన మంగళగిరికి చెందిన క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి రాష్ట్రీ బాల పురస్కార్-2025కు ఎంపికై, ఈ నెల 26న ఢిల్లీ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జెస్సీరాజ్ అవార్డును అందుకున్న విషయం విదితమే. ఈ మేరకు ఆదివారం మంగళగిరిలో ఆమెను బిజెపి నాయకులు కలిసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పంచుమర్తి ప్రసాద్, తుల్లిమిల్లి రామకృష్ణ, అమ్మయ్య చౌదరి, భాను కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మంగళగిరి



ది సిటీ ఎన్జీఓ అసోసియేషన్ డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం మంగళగిరిలోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్జీఓ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షునిగా ఎం.నాగరాజు, సహాధ్యక్షునిగా డి.ప్రకాశరావు, ఉపాధ్యక్షులు బి.రాధిక, ఎస్.సాజిద్ అలీ, కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, కార్యాలయ కార్యదర్శి డి.రామకృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా టి.బాపూజీ, బి.ఏడుకొండలు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కెఆర్ఎస్ గణేష్, సహాయ ఎన్నికల అధికారిగా అడపా రవి, పరిశీలకులుగా ఆర్.వినోద్‌కుమార్ వ్యవహరించారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు శివాలయం హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం స్వామివారి హుండీల లెక్కింపు చేపట్టనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ తెలిపారు. శివాలయం ముఖ మండపంపై లెక్కింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మిద్దె సెంటర్లోని శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి వారి దేవస్థానంలోని హుండీ లెక్కింపు కూడా చేపట్టనున్నామని తెలిపారు.

ఎస్సీల స్థితిగతులపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్రంలో ఎస్సీల జనాభా శాతం, స్థితిగతులపై తుది జాబితా విడుదల చేయడానికి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ ఆదేశాలతో ఆడిట్ నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తెనాలి మున్సిపాలిటీ, సచివాలయల పరిధిలో ఎస్సీ కులాలకు సంబంధించిన వివరాలతో ముసాయిదా జాబితాను సంబంధిత సచివాలయ నోటీసు బోర్డుల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రచురించిన ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు, ఫిర్యాదులను వార్డు రెవెన్యూ కార్యదర్శికుల ఈ నెల 31వ తేదీలోపు లిఖిత పూర్వకంగా అందజేయవచ్చని సూచించారు.

రచయిత 'ఆళ్ల'కు సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి, కవి ఆళ్ల నాగేశ్వరరావుకు అటల్ బిహారీ వాజ్‌పేయి జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. వాజ్‌పేయి దార్శనిక జీవితం అనే అంశంపై తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఈ నెల 25న నిర్వహించిన తెలుగు వచన కవితల పోటీల్లో నాగేశ్వరరావు రచించిన యుగ పురుషుడు అనే ఉత్తమ కవితకు పురస్కారం లభించింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బేట రాజమల్లు, కోశాధికారి రాపర్తి సునీల్ కుమార్, కార్యదర్శి బద్రి శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి పెద్ది భరత్‌లు సంబంధిత పురస్కార పత్రాన్ని ఆదివారం పంపినట్లు నాగేశ్వరరావు తెలిపారు.



భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గాలిగోపురం సెంటర్ వద్ద ఆదివారం మాతా సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు లింగినేని శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షులు సాదరబోయిన నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన వెంకటనరసయ్య, కార్యదర్శి పేరం పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు కలెక్టర్, ఎస్‌పి స్పందన రద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం నరసరావుపేట మండలం యల్లమంద గ్రామ పర్యటన నేపథ్యంలో పల్నాడు జిల్లా స్పందన రద్దు చేశారు. అధికారులు, పోలీసులు పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిన నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ మరియు జిల్లా పోలీసు కార్యాలయాలలో జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయా కార్యాలయాల నుండి వేర్వేరు ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

అంబేద్కర్ భవనాన్ని త్వరలో పూర్తి చేస్తాం : పెమ్మసాని

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



అంబేద్కర్ భవనాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరులో అంబేద్కర్ భవనాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ ఆదివారం సందర్శించారు. నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం పై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణం పై అధికారులు సరిగా పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్ర శేఖర్ మీడియా తో మాట్లాడుతూ అంబేద్కర్ భవన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టూ.6కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేశామన్నారు. వైసీపీ అధికా రంలోకి వచ్చిన తర్వాత దీనిని గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేసారని తెలిపారు. బడుగులు, బలహీన వర్గాలకు చెందిన అభివద్ధి అంటే వైసీపీ నేతలకు పట్టదన్నారు. జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని నిర్మాణం పూర్తి చేయాలన్నారు.రాబోయే రోజుల్లో బడుగులకు ఉపయోగపడే విధంగా భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ భవన్ లో స్టడీ సెంటర్, లైబ్రరీ, అన్నిరకాలుగా ఉపయోగపడే విధంగా నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు,మాజీ మంత్రి ఆలపాటి రాజా , టిడిపి నాయకులు మద్ధిరాల మ్యాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు 29వ డివిజన్ ఏటి అగ్రహారం సెంట్రల్ పబ్లిక్ స్కూల్ లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ విద్యారంగంతో పాటు క్రీడారంగాన్ని కూడా విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, పవర్ లిఫ్టింగ్ పోటీలకి గుంటూరుని ప్రధాన కేంద్రంగా తయారు చేస్తామని గళ్ళా మాధవి తెలిపారు. అదే విధంగా క్రీడాకారులకు తగిన సౌకర్యాలు కల్పించడం తోపాటు అసోసియేషన్ కి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్రీడల్లో రాణించడం ద్వారా యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా అవకాశం దక్కుతుందని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. అన్ని క్రీడల్లో యువత రాణించి ఆంధ్రప్రదేశ్ కి, భారత దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ భాస్కర్, డివిజన్ అధ్యక్షులు మహబూబ్ సుభాని, సంధాని పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పారిశుధ్య పనుల పట్ల కార్మికులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం కమిషనర్ భాగ్యనగర్, పట్టాభిపురం, ద్వారకానగర్, గోరంట్ల, షాప్ ఎంప్లాయిస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య పనులు, ఓసి కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, నూతన కాంపాక్టర్‌బిన్లు, పుష్‌కాట్స్ అందించామని, వెహికిల్ షెడ్‌లో పారిశుధ్య పనులకు వినియోగించే వాహనాల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టడానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు. త్వరలో ప్రతి డివిజన్‌కు ఒక ట్రాక్టర్ ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలో పారిశుధ్య పనుల మెరుగుదల కోసం కృషి చేస్తుంటే కొంత మంది సిబ్బంది, అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఉంటున్నారని వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంహెచ్‌ఓ, సిఎంఓహెచ్‌లు రోజు ఉదయం, మధ్యాహ్నం క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. నగర ప్రజలు కూడా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటానికి సహకరించాలని కోరారు. ఇంటి ముందుకు చెత్త తీసుకోవడానికి ప్రజారోగ్య కార్మికులు రాకుంటే జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103 కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రోడ్లపై, కాల్వల్లో చెత్త వేయకూడదని తెలిపారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఏసిపిలు రెహ్మాన్, మల్లిఖార్జున, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్..

గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి నేడు ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేరాల నియంత్రణకు చర్యలు

సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు - హెల్మెట్ వినియోగం తప్పనిసరి

ప్రజాశక్తితో గుంటూరు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్





నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. పెరుగుతున్న సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వాడకం తప్పనిసరి అని ఆయన తెలిపారు. హెల్మెట్ వినియోగంపై అన్ని పోలీసు స్టేషన్ల స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

జిల్లాలో సైబర్ నేరాల పెరుగుదల?

సైబర్ నేరాల నియంత్రణకు అన్నిచర్యలు తీసుకుంటున్నాం. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం తాముఅన్నిస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. సాధారణ ప్రజలతో పాటు సీనియర్ సిటిజన్లు, మహిళ, బ్యాంకింగ్ రంగాలతో పాటు విద్యార్థి సంఘాలకు కూడా సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 221 కేసులు నమోదవగా, గత ఏడాది 286 కేసులు నమోదు అయ్యాయి.

హెల్మెట్ వినియోగంపై అవగాహన?

జిల్లాలో ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి. అలాగే సురక్షితమైన డ్రైవింగ్, స్వీయరక్షణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలి. పెరుగుతున్న ప్రమాదాల నివారణకు వీటిని తప్పనిసరిగా పాటించాలి. వీటిపై ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ట్రాఫిక్ కూడలి ప్రాంతాల్లోనే నిర్వహిస్తున్నాం.

రోడ్డు ప్రమాదాలు పెరిగాయా?

గత సంవత్సరంలో 334 ప్రాణాంతకం, 638 సాధారణ రోడ్డు ప్రమాదాలు నమోదు అయ్యాయి. నమోదైతే, 2024లో మొత్తం 413 ప్రాణాంతకం, 611 సాధారణ రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. మరణాల్లో 24 శాతం పెరుగుదల ఉండగా సాధారణ ప్రమాదాల్లో 4 శాతం తగ్గాయి. డ్రంకెన్ డ్రైవ్ కేసుల బుకింగ్, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు, అన్ని బ్లాక్ స్పాట్‌లు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు అంటే రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాలను సరిదిద్దడం, స్పీడ్ బ్రేకర్స్‌తో పాటు జీబ్రా లైన్స్ ఏర్పాటు చేసున్నాం. మైనర్‌ల డ్రైవింగ్‌ను నియంత్రిస్తున్నాం.

ఎన్‌ఫోర్సుమెంట్‌తో నేరాల నియంత్రణ?

ప్రధానంగా పిడిఎస్ బియ్యం, ఇసుక, గంజాయి, మద్యం, వ్యభిచారం అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభించబడింది. మరియు జిల్లాలో అన్ని అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఎన్‌ఫోర్సుమెంట్ విభాగాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని మెరుగుపరచడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సంబంధించి గత సంవత్సరంలో 936 కేసులు నమోదు కాగా, ప్రస్తుత సంవత్సరంలో మొత్తం 1695 కేసులు నమోదు చేశాం.

గ్రీవెన్సు ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం?

ప్రజల నుంచి ప్రతి సోమవారం స్వీకరిస్తున్న విజ్ఞాపనలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు 2241 విజ్ఞాపనలు స్వీకరించాం. వీటిల్లో 2024 పరిష్కరించాం. ఇంకా 217 వివిధ దశల్లో దర్యాప్తులో ఉన్నాయి.

నేరాల నియంత్రణలో సిసి కెమెరాలు?

జిల్లాలో ఇప్పటి వరకు ముఖ్యమైన ప్రదేశాల్లో 670 సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటిని 5 వేల వరకుపెంచాలని లక్ష్యంగాపెట్టుకున్నాం. ప్రతి ఒక్కరు తమ వ్యాపార సంస్థల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. నేరాల నియంత్రణకు ధనికులు, అపార్టుమెంటు వాసులు, ముఖ్యమైన వ్యక్తులు వీటిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎఎన్‌యులో ముగిసిన జూడో టోర్నమెంట్



ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న సీనియర్ స్టేట్ జూడో టోర్నమెంట్ ఆదివారంతో ముగిసిందని ఆంధ్ర ప్రదేశ్ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్ సుబ్బారావు, సీఈవో నామిశెట్టి వెంకట్, శ్రీహరి నాయుడు తెలిపారు. ఈ టోర్నమెంటుకు జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరిశీలకులుగా ఉమేష్ కుమార్ సింగ్ హాజరయ్యారని పేర్కొన్నారు. టోర్నమెంట్లో విజేతలకు మెడల్స్ అందజేశారు. సీనియర్, క్యాడెట్, సబ్ జూనియర్ కేటగిరీలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్ జరిగిందని వివరించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ మెన్ కేటగిరీలో 60 కేజీలు, 66 కేజీలు, 73 కేజీలు, 81 కేజీలు, 90 కేజీలు, 100 కేజీలు, ప్లస్ 100 కేజీల కేటగిరిలో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే మహిళల కేటగిరిలో 48 కేజీలు, 52 కేజీలు, 57 కేజీలు, 63 కేజీలు, 70 కేజీలు, 75 కేజీలు, ప్లస్ 78 కేజీల విభాగంలో పోటీలు జరిగాయని తెలిపారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన యూనివర్సిటీ ఇన్చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే రత్న షీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు.



పల్నాడులో నేషనల్ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నీ

కె-రిడ్జ్ స్కూల్ వేదికగా ప్రారంభమైన నేషనల్ టోర్నమెంట్ - 14 రాష్ట్రాల నుండి క్రీడాకారులు హాజరు

వివరాలు తెలియజేసిన కె-రిడ్జ్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల కె -రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఆదివారం 18 వ నేషనల్ ఫ్లోర్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్ లో 14 రాష్ట్రాల నుండి దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని కె-రిడ్జ్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఇండియన్ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీపేంద్రఆర్య హాజరై మాట్లాడారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి విజయాలు సాధించి, భారతదేశం పేరును నిలబెట్టాలని కోరారు. కె-రిడ్జ్ స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ఫ్లోర్ బాల్ ఇండియా అబ్జర్వర్ పంకజ్, ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ఫ్రీజోజాన్ లు పాల్గొని ప్రసంగించారు. 18వ నేషనల్ ఫ్లోర్ టోర్నమెంట్లో భాగంగా మొదటి రోజైన ఆదివారం అండర్-12, అండర్-17 విభాగాల్లో బాలుర పోటీలు నిర్వహించారు. చత్తీస్ గడ్, ఢిల్లీ మధ్య జరిగిన పోటీలో ఛత్తీస్ గడ్ 5 - 0 పాయింట్స్ తో గెలిసింది. బీహార్, ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన పోటీలో బీహార్ 6 - 0 గెలుపొందింది. తమిళనాడు 3- 0 పాయింట్స్ తో కర్ణాటక జట్టు పై విజయం సాధించింది.



మెడల్స్ సాధించిన వెటరన్ క్రీడాకారులు

వెటరన్ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో గుంటూరుకి చెందిన ఇద్దరు వెటరన్ క్రీడాకారులు ఆదివారం పోటీల్లో తమ ప్రతిభ ను ప్రదర్శించారు. పెంటెల సుబ్బాయమ్మ 70 ఏళ్ల వయస్సులో 5కే వాక్, 100కే రన్, జావాలిన్ పోటీల్లో మొదటి స్థానం పొందారు. అలాగే పెంటేల జైహింద్ గురూజీ అనే వెటరన్ క్రీడాకారుడు 5కే వాక్, 400మీటర్ ల రన్, 100 మీటర్ ల రన్ లో మొదటి స్థానం పొందారు. వీరి ప్రతిభను క్రీడాకారులు, పోటీల నిర్వాహకులు లాల్ వజీర్ అభినందించారు.